ఓం నమోభగవతే శ్రీరమణాయ

ఉమాసహస్రము

(తృతీయ శతకమున – తృతీయ స్తబకము)

ఏకాదశ స్తబకము

అవ:- ఈ పదునొకండవ స్తబకమున – వెనుకటి స్తబకమునందు వలెఁగాక, పాదాది కేశాంతముగస్తుతి కావింపఁబడుచున్నది. ఇచటఁగూడ యథాపూర్వకముగా, ప్రథమశ్లోకము – హాసస్తుతి పరమగుచున్నది.

మూ॥ ఝషకేతునా ప్రయుక్తః, సమ్మోహనచూర్ణముష్టిరీశానే
దరహాసో ధరదుహితుః కరోతు భువనంవశే ఽస్మాకమ్॥ 1

పార్వతీదరహాసము – మీనధ్వజుఁడీశ్వరుని యందు ప్రయోగించిన సమ్మోహన చూర్ణముష్టి. ఆదరహాసము – మామనుష్యలోకమును మావశమునం దుంచుఁగాత!

ప్రభ:- మీనధ్వజుడు = ఝషకేతుఁడు – మన్మథుఁడు. సమ్మోహనచూర్ణ ముష్టి = సమ్మోహింపఁజేయు చూర్ణసంగ్రాహము. ఈశ్వరుని తనయధీనమున నిలుపుకొనుటకు మదనుని చేత ప్రయోగింపఁబడిన సమ్మోహన చూర్ణముష్టియగు పార్వతీమందహాసము – ఇతరులగు నసురులచేత ఆక్రమింపఁబడిన మాలోకమును మాయధీనమునందుంచుటకు మిక్కిలి సమర్థమని భావము.

ఇచట దరహాసము – సమ్మోహన చూర్ణముష్టియని సంభావింపఁబడుట వలన నిది గమ్యోత్ప్రేక్షయగును.

మూ॥ ఉపజీవద్భిః కాన్తే ర్లేశాంస్తే జగతి సున్దరైర్భావైః।
ఉపమితుమజ్గానితవ ప్రాయో లజ్జేఽమ్బ। యతమానః॥ 2

అమ్మా! ఈ లోకమున నీయొక్క కాంతిలేశముల నాశ్రయంచి జీవించుచున్న సుందరములగు పదార్థములతో, నీయంగములనుపమించుటకు ప్రయత్నము గలవాఁడయినను నేను మిక్కిలి లజ్జించుచున్నాఁడను.

ప్రభ:- లోకమునందలి కవులు – ముఖాదులయందు – ఆహ్లాదకత్వాది ధర్మములను స్ఫురింపఁజేయుటకు, ముఖాదులకంటె వేరయి, స్వతః సిద్ధమగుచున్న చంద్రాదులతో వానికి ఔపమ్యమును జెప్పుదురు. ప్రస్తుతమగు నీయంగసౌందర్య వర్ణనమునందు మాత్రము – ఈలోకమునందలి సుందరవస్తువులన్నియు – నీయొక్క కాంతివలననే ఉనికిగలిగి వేరొక కాంతి లేనివగుట వలన స్వతసిద్ధములు కానివగుచున్నవి. విషయియగు ఉపమానమును – విషయమగు ఉపమేయమునుగూడ – వేరయియుడునప్పుడే గదా వానికి సాధర్మ్యమును వర్ణించుట వలన ఉపమ యేర్పడును? కావుననే అసంభవమగు నీయంగసౌందర్యోపమానకథన కర్మయందు ప్రవర్తించిన నాకు సిగ్గుకలుగుచున్నది. అయినను ప్రయత్నమును విడుచుట లేదు. కావుననే అపుడపుడు లజ్జించుచున్నాను. అని భాము. '' నీ కాంతికంటె భిన్నమగు కాంతి లేకుండుట వలన నీకుపమానము గలుగదు.'' అను నీ యర్థము – ద్వితీయస దృశ వ్యవచ్ఛేద ఫలకవర్ణన విషయీభూతము. కావున నిది – అనన్వయాలంకార ధ్వనియగును. ''నీ కాంతితో పోల్పదగిన రెండవ వస్తువు లేదు.'' అనునపుడు – అన్వయము కుదురుట లేదు. కావున అన్వయము లేని యీయలంకారమునకు అనన్వయమని పేరు కలిగినది.

మూ॥ అవతంస పల్లవతులాం బిభ్రాణం శ్రుతినతభ్రువః శిరసి
చరణం వ్రజామిశరణం వామం కామారి లలనాయాః॥ 3

శ్రుతి సుందరీ ! శీర్షమునందు (వేదాంతమునందు) అవతంసపల్లవ సామ్యమున భరియించుచున్న హరసుందరి యొక్క వామ – చరణమును శరణముగా భజించెదను.

ప్రభ:- వేదాంతము – ఉపనిషత్తులు. అవతంస పల్లవసామ్యమును = అలంకారము కఱకగు కిసలయము తోడి సమానత్వమును. వామచరణము = సుందరమగు పాదము ఎడమ పాదము. దేవి శివుని వామార్ధము గావున వామచరణము వర్ణింపఁబడినది. కిసలయోపమమగు దేవీ పదము – వేద శిరస్సునందగు భూషణమగుచున్నది.

''సర్వేవేదాయత్ పద మామనన్తి''

అని కఠశ్రుతియందుగ్గడింపఁ బడినదిగదా ? ఇట్లు శ్రుతిశిరోభూషణమగు దేవీ చరణమే నాకు శరణమని భావము.

మూ॥ శఙ్కరనయనోన్మాదన – మతిమధురం భాతిమతిమతావర్ణ్యే
జఙ్ఘాయుగం భవత్యాః కుసుమపృషత్కస్య సర్వస్వమ్॥ 4

బుద్ధిమంతునిచేత స్తుతింపఁదగినజననీ! శివనయనమ్మోహనమును, అత్యంతరమణీయమును అగు నీజంఘాయుగము – పుష్పబాణునకు సర్వస్వమై సర్వధనమై రాజిల్లుచున్నది.

ప్రభ:- జంఘాయుగము = ప్రసృతాద్వయము – పిక్కలజంట. ఇచట పార్వతీ జంఘాయుగము మన్మథునకు సర్వస్వముగా సంభావింప బడినది.

మూ॥ ఏకైక లోకనేద్వయమన్యోన్యస్మరణ హేతుతామేతి
దేవి! భవస్య, తవోరుః తుణ్డాచ గజేన్ద్రవదనస్య ॥ 5

మహేశమహిషీ! నీయూరువును, గణపతి తొండమును, ఇవి రెండును గూడ, ఏకైక దర్శనమున పరస్పరమగు స్మరణమునకు హేతువులగుచున్నవి.

ప్రభ:- ఊరువు – తొండము అను నీ రెండింటిలోను ఊరువును జూచునపుడు తొండముయొక్క స్మృతి కలుగుచున్నది. అట్లే తొండమును జూచునపుడు ఊరువు యొక్క స్మృతి కలుగుచున్నది. ఇట్లీ రెండునుగూడ – అన్యోన్యస్మారకములగుచున్నవని భావము.

''సదృశానుభవాద్ వస్తు స్మృతిః స్మరణముచ్యతే''

అను సాహిత్యదర్పణ లక్షణమువలన నిచటియలంకారము స్మరణమని తెలియునది.

మూ॥ నాకోఽవలగ్న మీశ్వరి! కటిరవనిర్భోగినాం జగన్నాభిః
కుక్షౌ న కేవలం తే బహిరపివపుషిత్రయోలోకాః ॥ 6

ఈశ్వరీ! నీకు నాకము – నడుము, భూమి – కటి, పాతాళము– నాభి, ఇట్లు ముల్లోకములును నీకుక్షియందుమాత్రమే గాక వెలుపలి శరీరమునందుఁగూడ నున్నవి.

ప్రభ:- నాకము = స్వర్గలోకము. కటి = శ్రోణి, భోగిలోకము = పాతాళము నీకుక్షియందు స్వర్గ – భూమి – పాతాళములున్నవి. అవి కేవలము నీకుక్షియందేకాక బహిశ్శరీరమునందుఁగూడ, అవలగ్న – కటి – నాభిరూపములై యున్నవని భావము.

మూ॥ మన్యే మహార్కపాణం తవవేణీమచలపుత్రి! మదనస్య
అసిధేనుకాం విశఙ్కే నిశితతరాగ్రాంతురోమాలిమ్॥ 7

అచలపుత్రివగు పార్వతీ! నీ వేణిని (జడను) మదనునికి మహా కృపాణముగా తలంచెదను. రోమాలినిమాత్రము - మిక్కిలి వాడియగునట్లు సానరాతియందు పదనుచేయఁబడిన, అసిపుత్రికనుగా (చిన్న కత్తినిగా) విశంకింతుసు.

ప్రభ:- మహాకృపాణము - గొప్పఖడ్గము, రోమాలి = రోమరాజి. ఇందు స్వరూపోత్ప్రేక్ష స్ఫుటమైయున్నది.

మూ॥ ద్విరదవదనేనపీతం షడ్ వదనేనాథ సకలభువనేన
అక్షయ్యక్షీ రామృతమమ్బాయాః కుచయుగంజయతి॥ 8

ద్విరద - వదనునిచేతను, షడ్ - వదనుని చేతను, తరువాత సకల లోకవదనలముల చేతనుగూడ క్రోలఁబడినను, అక్షయ్యమగు క్షీ రామృతము గలదియగు అమ్మ స్తవయుగము - జయించుచున్నది.

ప్రభ:- ద్విరదమన రెండు దంతములు గల యేనుఁగు. ద్విరదవదనుఁడన గజముఖుఁడగు గణపతి. షడ్ వదనుడు = ఆరుముఖములు గలవాఁడు - సుబ్రహ్మణ్యుఁడు. అక్షయ్యము = క్షీణింపఁజేయుటకు శక్యము కానిది.

మూ॥ జగదమ్బలమ్బమానా పార్శ్వద్వితయే తవాగలాద్భాతి
సాన్ద్రగ్రథితమనోజ్ఞప్రసూనమాలేవ భుజయుగలీ॥ 9

ఓ జగదంబా! నీ భుజయుగళి - గళమునుండి మొదలుకొని యుభయపార్శ్వముల యందును వ్రేలాడుచున్నదై, దట్టముగాఁ గూర్పఁబడిన మనోజ్ఞమగు ప్రసూనమాలవలె భాసిల్లుచున్నది.

ప్రభ:- భుజయుగళి = బాహుద్వయి. ప్రసూనమాల = పూలదండ, కంఠము నుండి ఉభయ పార్శ్వములను బొందిన బాహుయుగళి పుష్పమాలవలె నున్నట్లు సంభావించుట చేత ఉత్ప్రేక్ష అలంకారమగుచున్నది.

పుష్పమాల - కోమలమైనను తెరపిలేనట్లు కూర్పఁబడినదనియు, భుజయుగళి మృదులమైనను దృఢమగు సంధిబంధము చేతి సంపన్నమనియు గమ్యము.

మూ॥ జానన్తిశక్తిమసురాః, సుషమాంసఖ్యోవదాన్యతామృషయః
మృదుతాం తవామ్బ! పాణేర్వేదసదేవః పురాంభేత్తా॥ 10

అమ్మా! అసురులు నీ శక్తిని తెలిసికొనుచుందురు. సఖులు నీ సుషమను (గొప్పశోభను) తెలిసికొనుచుందురు. ఋషులు వదాన్యతను గ్రహించుచుందురు. పురవైరియగు ఆ శివుఁడు నీ పాణిమృదులత నెఱుఁగును.

ప్రభ:- (అసురులు - శక్తి యుక్తవనియు, సఖులు - సుషమామయివనియు, ఋషులు - వదాన్యవనియు, శివుఁడు - మృదుల పాణివనియునిన్ను గుర్తింతురని భావము.)

మూ॥ కమ్బుసదృగమ్బ! జగతాం మణివేషోడుస్రజాకృతాకల్పః
కణ్ఠో౽నఘస్వరస్తే ధూర్జటిదోర్నయనకర్ణహిత ః॥ 11

ఓ జగదంబా! నీ కంఠము - కంబుసదృశము, అలంకారార్థమగు మణియను వేషము (రూపము)తో నున్న నక్షత్రమాలచేత విరచితమగు భూషణముగలది. నిర్దుష్టమగు స్వరముగలది. (కావుననే) ధూర్జటియొక్క బాహువులకును, దృష్టికిని, కర్ణమునకును హితమయినది.

ప్రభ:- కంబుసదృశము = శంఖముతో సాటియగునది. మణి... భూషణము గలది = రత్నములను మిషతోనున్న నక్షత్రములే మాలగాగలది. ఆలింగన సుఖకరమగుట వలన కంఠము యొక్క శంఖసాదృశ్యము - శివుని బాహువులకును, నయనసుభగమగుట వలన, నక్షత్రమాలారచన, శివుని దృష్టులకును, శ్రుతిసుఖకరమగుట వలన నిర్దుష్టమగు తద్ ధ్వని శివుని శ్రవణములకును హితమగునని భావము.

'యథాసఙ్ఖ్య క్రమేణైవ క్రమికాణాం సమన్వయః'
అను లక్షణమువలన నిది యథా సంఖ్యమను నలంకారమగుచున్నది.

మూ॥ హరకాన్తే! వదనంతే దర్శందర్శంవతంస శీతాంశుః
పూర్ణోఽప్యవాపకృశతాం ప్రాయేణాసూయయాశుష్యన్॥ 12

హరసుందరీ! శివశిరోభూషణ – చంద్రుఁడు నీయాననమును చూచి చూచి, పూర్ణుడయినను, ప్రాయశః నీముఖప్రభను సహింపలేకుండుట వలనఁ గలిగిన అసూయ చేత నీరసుఁడై కృశత్వము నొందెను.

ప్రభ:- శివుని శిరస్సునందున్న అర్ధచంద్రుఁడు – అర్ధచంద్రుఁడగుటకు హేతువు – '' ఉమా ముఖ దర్శనజాతమగు అసూయయే'' అని సభావింపఁబడినది. కావున నిది ఉత్ప్రేక్షయగుచున్నది.

మూ॥ చన్ద్రం రణాయసకలాచపలాక్షీ వదనజాతి రాహ్వాయతాం
తంతుమహసాముఖంతే మహేశకాన్తే! జిగాయైకమ్ ॥ 13

మహేశ్వర కాంతా! చపలాక్షులగు సుందరుల ముఖజాతియంతయును గూడ చంద్రుని యుద్ధమున కాహ్వానించునుగాక! (సకల స్త్రీ వదనముల చేతను గూడ నెదుర్కొనఁబడినను గూడ జయింపఁబడని) ఆ చంద్రుని మాత్రము నీముఖ మొక్కటియే – కాంతిచేత జయించినది. ''నీముఖమునందలి మహస్సు – అటువంటి సర్వశోభాతిశాయి'' అని భావము.

మూ॥ వదనకమలంతవేశ్వరి! కమలజయాద్దర్పితంసుధాభానుమ్
నిర్జిత్యకమలజాతే రమలం మహదాజహారయశః ॥ 14

ఈశ్వరీ! నీ వదనకమలము – కమలజయము వలన గర్వించిన అమృతాంశునిజయించి, కమలజాతికి మిగుల శుభ్రమగుయశమును సంపాదించెను.

ప్రభ:- కమలములను జయంచుట చేత దర్పించిన చంద్రుని దమించుటవలన మహేశ్వర కాంతాముఖము – కమలజాతికే యశస్సు నుఘటించెను. కావుననే కమలమునకు ముఖముతోడి యుపమ ప్రఖ్యాతమయినది. ఇట్లు కమలజాతికి, ముఖోప మానతారూపమగు యశస్సు సంపాదింపఁడబడినదని కమలమునకు ముఖోపమానతా లాభహేతువును సంభావించుట వలన నిది గమ్యమగు ఉత్ప్రేక్షయగుచున్నది.

మూ॥ లావణ్యమరన్దాశా భ్రమద్ భవాలోకబమ్భరం పరితః
ముగ్ధం ముఖారవిన్దం జయతి నగాధీశనన్దిన్యాః ॥ 15

అంతటను గల లావణ్యమను మరందమునందలి యాశచేత (అధికమగు నపేక్షచేత) భ్రమించుచున్న శివదృష్టులను భ్రమరములు గలదియు – ముగ్ధమును, అగు నగాధీశనందిని యొక్క ముఖారవిందము జయించుచుండును. (ఉత్కర్షచే వెలయుచున్నవి).

ప్రభ:- లావణ్యము = సౌందర్యము, మరందము = తేనె, భ్రమరములు = తుమ్మెదలు. నగాధీశనందిని = పార్వతి, ముగ్ధము = సుందరము, ఇచట – లావణ్య – మరందములకును భవాలోక – భ్రమరములకును, ముఖ – అరవిందములకును గూడ తాద్రూప్యము చేనగు రంజనమువలన రూపక మలంకారమగుచున్నది. 'సర్వేశ్వరదృష్టి– భగవతీవదనామృతగ్రహణలాలస.' అని భావము.

మూ॥ శుద్ధేన్దుసారనిర్మిత, మాస్యార్ధంతే భవాని భాలమయమ్
సకల రమణీయసారైర్నిర్మిత మర్ధాన్తరం విధినా ॥ 16

భవానీ! భాలమయమగు నీ ముఖమునందలి మీఁదియర్ధభాగమును విధాత, శుద్ధమగు చంద్రునిసారమగు నమృతముచేత నిర్మించెను. క్రింది యర్ధభాగమును సకల రమణీయ వస్తువులయొక్కయు సారముల చేత నిర్మించెను.

ప్రభ:- భాలమయము = ఫాలమయము. విశాలమగు నుదుటితోఁగూడినది. విధాత = బ్రహ్మ. సారములచేత = స్థిరములగు నంశముల చేత, నీముఖమునందలి మీఁది భాగము – ప్రభామయమగు అమృతఖండము. క్రిందిభాగము – ఘనమగు సకల సౌందర్యఖండము. అని భావము. సర్వజీవన – ధారణ – సకల భోగసాధన బల విధానము నీ ముఖము అని భావము.

మూ॥ వదనం తవా ద్రిదుహిత ర్విజితాయ నతాయ శీతకిరణాయ
ద్వారపపదవీం ప్రదదావయమిహ దరహాసనామధరః ॥ 17

పార్వతీ! నీ ముఖము – శీతల ప్రభాదులచేత విజితుఁడును, కావుననే నతుఁడును (నమ్రభావము నొందినవాఁడును) అగు శీతకిరణునికి ద్వార పాలపదనిచ్చెను. ఇతఁడు (ఈ చంద్రుఁడే) ఇచ్చట (నీ ముఖమునందు) దరహాసమను నామమును ధరించుచున్నాఁడు.

ప్రభ:- విజితుఁడు = పరాజితుఁడు – ఓడింపఁబడినవాఁడు భవన్ముఖవిజితుఁడగు చంద్రుఁడు ద్వారపాలకుఁడై నీ ముఖమున మందహాసమను నామమున స్థాపింపబడియెనని భావము. కవిప్రౌఢోక్తి సిద్ధమును సహేతుకమును, అసిద్ధవిషయమును అగు స్వరూపోత్ప్రేక్ష – అలంకారము.

మూ॥ తే తేవదన్తు సన్తో నయనం, తాటఙ్క మాలయం ముకుటమ్
కవయోవయంవదామః సితమహసం దేవి తేహాసమ్॥ 18

దేవీ! సజ్జనులగు ఆయా పురాణకవులు, శుభ్రమగు కాంతిగల చంద్రుని నీకు, నయనముగను, తాటంకముగను, ఆవాసముగను, కిరీటముగను చెప్పనిమ్ము. మేము మాత్రము – ఆ చంద్రుని – నీహాసమని చెప్పుదుము.

ప్రభ:- తాటంకము = కర్ణభూషణము, త్రినేత్రునికి వామార్ధమున చంద్రుఁడు లోచనముగా నయ్యెను. కావున దేవికి చంద్రుఁడు నయనమగుననునది పురాణ ప్రసిద్ధము.

'తాటంక యుగలీభూత తపనోడుపమణ్డలా'

దేవి సూర్య – చంద్రమండలములు కర్ణభూషణద్వయిగాఁగలది. అని లలితా సహస్ర నామావలియందున్నది. కావునఁ గొందఱు చంద్రుని దేవికి తాటంకమని చెప్పిరి. అందే ''చన్ద్రమణ్డల మధ్యగా'' ''చంద్రమండల మధ్యమునందుండునది'' అని చెప్పఁబడుట వలన దేవి నివసించు స్థలము కూడ చంద్రమండలమని చెప్పుదురు. ఆమె 'చంద్రచూడ' అను ప్రసిద్ధివలన = ఆమెకు చంద్రుని, కిరీటముగాఁగూడఁ చెప్పుదురు. ఇట్లు పూర్వులగు సత్కవులు నాలుగు తెరఁగులఁ జెప్పుదురుగాక! మేము మాత్రము ఆ సితకిరణుని హాసముగనే చెప్పుదుమని తాత్పర్యము. ఇట్లు – ఇచట పరపక్షముల యందు అనంగీకారము నుపన్యసించి, చంద్రుని హాసరూపముగా సంభావించుటవలన నిది సాపహ్నవోత్ప్రేక్షయగునని తెలియునది. ''నయనం తాటఙ్క మాననం ముకుటమ్'' అను పాఠాంతరము దీనికిఁగలదు.

మూ॥ బిమ్బాధరస్యశోభా మమ్బాయాః కోనువర్ణయితుమీష్టే
అన్తరపియా ప్రవిశ్య ప్రమథపతే ర్వితనుతే రాగమ్ ॥ 19

అంబా – బింబాధరము యొక్క శోభను వర్ణించుటకు సమర్థుడెవ్వఁడున్నాఁడు? ఆశోభ – ప్రమథపతియగు రుద్రుని యంతరంగమునందుఁగూడ ప్రవేశించి రాగమును (అనురాగమును) విస్తరింపజేయుచున్నది.

ప్రభ:- బింబాధరము = ఎఱ్ఱని దొండపండువంటి మోవి. శోభను – కాంతిని, (రక్తకాంతిని) రాగమును – రక్తవర్ణమును, అనురాగమును మహావిరక్తుఁడగు భగవానుని దురవగాహమగు హృదయమునఁగూడ ప్రవేశించి, రక్తవర్ణమగుదాని

ననురక్తముగాజేయుచు, బింబము వలె నెఱ్ఱనిదగు, పార్వతి యధరశోభ నెవ్వఁడును వర్ణింపఁజాలఁడని భావము.

మూ॥ గణపతయే స్తనఘటయోః పదకములే సప్తలోకభక్తేభ్యః
అధరపుటే త్రిపురజితే దదాసిపియూషమమ్బ! త్వమ్ ॥ 20

అవ్మా! నీవు నీ పుత్రుఁడగు గణపతికి స్తనఘటముల యందలి యమృతమును (స్తన్యరూపమును) సప్తలోకములయందునుగల భక్తులకు పాదారవిందమునందలి యమృతమును (మకరందరూపమును) త్రిపురములను జయించిన కాంతుడగుహరునికి, అధరపుటమునందలి యమృతమును (రసరూపమును) ఇచ్చుచున్నావు.

ప్రభ:- ఇట్లు పుత్రుని కొఱకును– భక్తులకొఱకును – భర్త కొఱకును – వారి వారికిఁ దగినరూపము గల అమృతము నిచ్చెదవని భావము.

మూ॥ దృక్పీయూషతటిన్యాం నాసాసేతౌ వినిర్మితేవిధినా
భాషాంభవతి శివేతే ముఖేవిహారో నిరాతఙ్కః॥ 21

ఓ శివా! దృష్టియను పీయూషనదియందు నాసయనుసేతువు బ్రహ్మచేత నిర్మింపఁబడియుండ, నీముఖమునందు కాంతి – విహారము నిరాతంకమగుచున్నది.

ప్రభ:- పీయూషనది = అమృతనది. నాస = ముక్కు. సేతువు = గట్టు, నిరాతంకము = అడ్డులేనిది – నిర్భయము.

సేతువు లేనియెడల నదీప్రవాహ భయము వలన విహారము నిశ్శంకము కాకపోవును. కావుననే బ్రహ్మ – నాసను సేతువుగా నిర్మించి, ''ప్రవహించుచున్న దృష్టియందు ముఖకాంతులు మగ్నములు కాఁగూడదు.'' అని దృష్టియను దేశమునకు మర్యాదను (హద్దును) ఏర్పరచెను. ఇచట దృక్ – తటినులకును, నాసా –

సేతువులకును గల తాద్రూప్యమువలన రూపక మలంకారమగుచున్నది. అది – హేతువగుసేతు నిర్మాణమునకు కాంతుల యొక్క నిరాతంక విహారమే – ఫలముగా సంభావించుటచేతనగు ఫలోత్ప్రేక్షకు – అంగమగుచున్నది. ఇట్లు– రూపక – ఉత్ప్రేక్షలకు – అంగాంగి భావము చేత నిది – సంకరమగుచున్నది.

మూ॥ కమలా విలాసభవనం కరుణాకేళీగృహంచ కమనీయే
హరదయితే తే, వినతహితే, నయనే, జనని! విజయేతే॥ 22

జననీ! కమలావిలాసభవనమును, కారుణ్య లీలాభవనమును అగుచు కమనీయములగు నీనయనములు – హరప్రియములును, వినత హితములును అగుచు విజయము నొనర్చుచున్నవి.

ప్రభ:- కమలా విలాసభవనము = లక్ష్మీ విహారగృహము. వినతహితములు = నమ్రతగల వారికి అనుకూలములు.

మూ॥ సర్వాణ్యప్యఙ్గాని శ్రీమన్తి తవేన్దుచూడకులకాన్తే!
కవిని వహవినుతి పాత్రే శ్రోత్రే దేవి! శ్రియాపేవ ॥ 23

చంద్రశేఖర కులకాంతవగు దేవీ! నీయంగములన్నియుఁగాడ శ్రీమంతములు, కవిని వహవినుతి పాత్రములునగు శ్రోత్రములు – శ్రీలే.

ప్రభ:- శ్రీమంతములు = శ్రీగలవి – సంపదగలవి. కవి – నివహ వినుతిపాత్రములు = కవి సమూహము యొక్క స్తుతుల కాస్పదములు.

వినుతులు – ఆధేయములును, శ్రోత్రములు – ఆధారములను, అగుటవలన శ్రోత్రము – పాత్రమగుచున్నది. శ్రోత్రముకంటె ఇతరములగు నంగములు శ్రీమంతములని చెప్పఁబడినవి. శ్రోత్రము మాత్రము శ్రీయేయని విశేషింపఁబడినది.

ప్రశ్న:- శ్రోత్రము - శ్రీయేగాని శ్రీమంతముకాదని యేల చెప్పఁబడినది?

ఉ:- ''శ్రీకర్ణ ఏషః'' అను పూర్వోక్తశ్లోకమును వ్యాఖ్యానించునపు డీయంశము కొంచెము ప్రదర్శింపఁబడినది. శ్రోత్రము - శ్రీయేయనుచోట శ్రీ శబ్దమునకు సంపద - అర్థము. ఛాందోగ్యమునందలిపంచమ ప్రపాఠకమున ''యోహ్వై జ్యేష్ఠంచ శ్రేష్ఠంచవేద'' అని యారంభించి, ''అథ హైనం శ్రోత్రమువాచ. యదహంసమ్పదస్మిత్వం తత్ సమ్పదసి'' అని శ్రోత్రము శ్రేష్ఠమగు ప్రాణముతో చెప్పెను. అని వినఁబడుచున్నది. లోకమునందు సంపన్నములగు విద్యలన్నియు శబ్దాత్మకములగుట చేత శ్రోత్రమునందే అంతస్సన్నిహితములు. కావున శ్రోత్రము - సంపద - (శ్రీ) యగుచున్నదని భావము.

మూ॥ అపికుటిలమలినముగ్ధస్తవ కేశః పుత్రిగోత్రసుత్రామ్ణః
బిభ్రత్ సుమానికాన్యపి హృదయం భువనప్రభోర్హరతి ॥ **24**

పర్వతేంద్రపుత్రీ! నీ కేశము - కుటిల - మలిన - ముగ్ధము, అయినను, ఏవో (సామాన్యములగు) పూవులను ధరించినది అయినను, భువనప్రభువగు భవునిహృదయమును హరించుచున్నది. (ఆకర్షించుచున్నది).

ప్రభ:- కుటిల - మలిన - ముగ్ధము - వక్రము (తిన్నదనము లేనిది) నల్లనిది (శుభ్రముకానిది) మూఢము (జడము)

ప్రశ్న:- కౌటిల్య మాలిన్యాదులగు - అపకర్షక గుణములతోఁ గూడిన కేశము. హృదయము నాకర్షించును అనునది లోక విరుద్ధము.

ఉ :- విరుద్ధము కాదు. ఉన్నతము, ఆనతమునగుచు వంకరలు గలిగినదియు, నల్లనిదగుట వలన జలద - మయూరాది వర్ణము గలిగినదియు, నగుకచమే దర్శనీయము. కావుననది - కుటిల - మలినమని చెప్పఁబడినది. ముగ్ధమన సుందరమని యర్థముగలదు. కావుననది - ముగ్ధమని చెప్పఁబడినది.

ఇట్లు - విరోధము - పరిహరింపబడుట వలన నిది విరోధా భాసమా? లేక అపి (అయినను) శబ్దస్వారస్యమువలన, జగత్ ప్రభుహృదయాకర్షకమగు కారణము లేకున్నను హృదయమునుహరించుట యను కార్యమును జెప్పుటవలన విభావనయా? అను సందేహమును గలిగించుటవలన విభావనా - విరోధాభాస - సంకరమగునిది - సందేహ సంకరాలంకార మగుచున్నది.

మూ॥ చరణాదికుస్తలాన్త ప్రకృష్ట సౌన్దర్యగాయినీ రేతాః
అఙ్గీకరోతుశమ్భోరమ్భోజదృగాత్మజస్యార్యాః॥ **25**

శివ సుందరియగు నుమా దేవి - చరణాది - కుంతలాంతమగు - అంగముయొక్క ప్రకృష్ట సౌందర్యమును గానము చేసిన, ఆత్మజుఁడగు గణపతికి సంబంధించిన యీయార్యల (ఆర్యావృత్త కలితములగుస్తుతులు) ను స్వీకరించునుగాత!

ఇది - సవ్యాఖ్యమగు ఉమాసహస్రమునందలి
ఏకాదశస్తబకము

****